సీజనల్ వ్యాధులతో కలవరం

- రోజురోజుకూ పెరుగుతున్న జ్వరపీడితులు
- ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు కిటకిట
- అప్రమత్తంగా ఉండాలని వైద్యుల సూచన


ప్రారంభానికి నోచుకోని ఆర్పీ పేట యూపీహెచ్‌సీ అదనపు భవనం


ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షల కోసం వేచి ఉన్న రోగులు


జ్వర పీడితులను పరీక్షిస్తున్న వైద్యాధికారి మట్టా శశిప్రియాంక

కంచరపాలెం: కంచరపాలెం పరిధి కొండవాలు, మురికివాడల ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. రోజురోజుకూ విషజ్వరాలు ప్రబలుతుండటంతో స్థానికులు కలవరపడుతున్నారు. ఏ ఇంట్లో చూసినా జ్వరపీడితులు కనిపిస్తున్నారు. వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు జరగడం, నీరు కలుషితం కావడంతో అనేక మంది సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారు. వీటి నివారణకు జీవీఎంసీ జోన్‌-5 అధికారులు రంగం సిద్ధం చేసినప్పటికీ వ్యాధిగ్రస్తులు మాత్రం పెరుగుతూనే ఉన్నారు. జీవీఎంసీ ఆస్పత్రులు, రామ్మూర్తిపంతులుపేట యూపీహెచ్‌సీలు, ప్రైవేటు హాస్పిటళ్లు జ్వరపీడితులతో కిటకిటలాడుతున్నాయి. సీజనల్ వ్యాధులపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

డయేరియాతో జాగ్రత్త..!

డయేరియా వచ్చిన రోగికి ఎక్కువగా వాంతులు, విరోచనాలు అవుతాయి. దీనివల్ల శరీరంలో నీటి శాతం తగ్గిపోయి మనిషి ప్రాణాలకే ముప్పు ఏర్పడే అవకాశం ఉంది. ఈ లక్షణాలు ఉన్నవారికి వెంటనే ఉప్పు, పంచదార కలిపిన ద్రావణం, ఓఆర్‌ఎస్‌లు తరచూ ఇవ్వాలని ఆర్పీ పేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(యూసీపీహెచ్) ప్రధాన వైద్యాధికారి డాక్టర్ మట్టా శశిప్రియాంక సూచించారు. పాలు, పాల పదార్థాలు ఇవ్వకూడదన్నారు.

కానరాని ప్రత్యేక వైద్యులు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో స్పెషలిస్ట్ వైద్య నిపుణులు సోమవారం నుంచి శనివారం వరకు వైద్య సేవలందించే వారు. కూటమి ప్రభుత్వంలో స్పెషలిస్ట్ సేవలను నిలిపేయడంతో యూపీహెచ్‌సీల్లో గంటల కొద్దీ పడిగాపులు కాయాల్సి వస్తోందని పలువురు రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వైద్య సిబ్బంది కొరత

కంచరపాలెం ఆర్పీ పేట ఆరోగ్య కేంద్రంలో ప్రతి రోజూ 100కు పైగా ఓపీ నమోదవుతోంది. ఇక్కడ వైద్య సిబ్బంది కొరత ఎక్కువగా ఉంది. ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్ట్ సెలవులు పెడితే తమకు ఇబ్బందులు తప్పడం లేదని పలువురు రోగులు వాపోతున్నారు. రక్త పరీక్షలు చేసే సిబ్బంది రాకపోవడంతో బయట పరీక్షలు చేసుకునే పరిస్థితి కనిపిస్తోంది. జ్వరపీడితులు ఎక్కువగా ఉండటంతో ప్రధాన వైద్యాధికారి రోగులందరికీ వైద్యం అందించాలంటే ఎక్కువ సమయం వేచి ఉండాల్సి వస్తోందని రోగుల బంధువులు చెబుతున్నారు.

అదనపు భవనం ప్రారంభమెప్పుడో..!

ఆర్పీ పేట యూపీహెచ్‌సీలో అదనపు భవన నిర్మాణం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మార్చి నాటికి పూర్తయినా.. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రారంభానికి నోచుకోలేదు. ఆరు నెలలు గడిచినా.. నేటికీ అదనపు భవనాన్ని ప్రారంభించకపోవడంతో రోగులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇరుకు గదిలోనే అన్ని రోగాలకు వైద్య పరీక్షలు చేయడంతో రోగుల బంధువులు కూడా కొత్త రోగాల బారిన పడి ఇళ్లకు వెళ్లే పరిస్థితి కనిపిస్తోంది. సంబంధిత అధికారులు స్పందించి వైద్య సిబ్బంది కొరత లేకుండా చూడాలని, ఆర్పీ పేట ఆరోగ్య కేంద్రం అదనపు భవనాన్ని వెంటనే ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.

వైద్యాధికారులను నియమించాలి

యూపీహెచ్‌సీల్లో ఒకే డాక్టర్ విధులు నిర్వహించడం వల్ల రోగులు ఇబ్బందులు పడుతున్నారు. అధిక సమయం వేచి ఉంటున్నారు. ఆరోగ్య కేంద్రంలో రోగుల సంఖ్యకు అనుగుణంగా ఇద్దరు వైద్యాధికారులను నియమించాల్సిన అవసరం ఉంది.

– ఎస్.ప్రశాంతి, కంచరపాలెం

స్పెషలిస్ట్ వైద్యుల జాడలేదు

ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక వైద్య నిపుణులు అందుబాటులో లేరు. పలు రోగాలకు చికిత్స కోసం కేజీహెచ్‌కు వెళ్లే పరిస్థితి కనిపిస్తోంది. కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యంపై శ్రద్ధ వహించడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి వైద్య సిబ్బందిని నియమించాలి.

– పి.భవాని, కంచరపాలెం

సబ్సిడీపై వంటనూనె విక్రయాలు


నరసింహనగర్ రైతుబజార్‌లో ఆయిల్ విక్రయిస్తున్న డీఎస్‌వో భాస్కరరావు

సీతంపేట: నరసింహనగర్ రైతుబజార్‌లో సబ్సిడీపై విక్రయిస్తున్న వంటనూనెల కౌంటర్‌ను శుక్రవారం పౌరసరఫరాల శాఖ డీఎస్‌వో భాస్కరరావు తనిఖీ చేశారు. గోల్డ్‌డ్రాప్, క్రిస్టల్, ఫ్రీడం సన్‌ఫ్లవర్ ఆయిల్ లీటర్ రూ.124 చొప్పున, పామాయిల్ రూ.110 చొప్పున సబ్సిడీపై విక్రయించాలని, బహిరంగ మార్కెట్‌లో కంటే తక్కువ ధరకు ఆయిల్ విక్రయిస్తున్నామని తెలిపారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. శుక్రవారం అన్ని రకాల ఆయిల్స్ 555 ప్యాకెట్లు విక్రయించామని రైతుబజార్ ఈవో పి.చినబాబు తెలిపారు.

40 కిలోల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్ నుంచి గంజాయి రవాణా చేస్తున్న నలుగురిని రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.2 లక్షలు విలువ చేసే గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వివరాలివీ.. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది శుక్రవారం స్టేషన్‌లోని వివిధ ప్లాట్‌ఫాంలలో తనిఖీలు చేపట్టారు. ఒడిశాకు చెందిన నలుగురి బ్యాగుల్లో 40 కిలోల గంజాయిని గుర్తించారు. గంజాయిని స్వాధీనం చేసుకుని.. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. జీఆర్పీ ఎస్‌ఐ శాంతారాం, ఆర్పీఎఫ్ ఎస్‌ఐ ఎం.ఎల్.మీనా తనిఖీల్లో పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైభవుడికి సుప్రభాత సేవ నేడు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించి, అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్టి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరుగుతాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి విశేష హారతులు సమర్పిస్తారు.

సీతమ్మధార రైతుబజార్ స్టాళ్లకు డ్రా


రైతులకు స్టాళ్ల టోకెన్లు అందిస్తున్న రైతుబజార్ ఈవో కొండబాబు

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్‌లో శుక్రవారం 63 స్టాళ్లకు డ్రా తీశారు. ఉదయం, సాయంత్రం బజారు రైతులకు స్టాళ్ల టోకెన్లను ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు అందజేశారు. ఈ సందర్భంగా ఈవో మట్లాడుతూ మార్కెటింగ్ శాఖ అధికారుల ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం రైతుల స్టాళ్లకు డ్రా తీసి కేటాయిస్తున్నట్లు తెలిపారు. రైతుబజార్ సహాయకుడు సతీష్, రైతులు పాల్గొన్నారు.

రైతుబజార్ కిటకిట


పువ్వుల స్టాళ్ల వద్ద వినియోగదారుల రద్దీ

సీతమ్మధార: దసరా పండగా సందర్భంగా సీతమ్మధార రైతుబజార్ కిటకిటలాడింది. శుక్రవారం ఉదయం నుంచే అధిక సంఖ్యలో వినియోగదారులు ఇక్కడికి వచ్చి పువ్వులు, కూరగాయలు, పూజా సామగ్రి కొనుగోలు చేశారు. పువ్వుల కౌంటర్లు రెండు పూటలా రద్దీగా కనిపించింది. కొన్ని రకాల పూలా ధరలు పెరిగాయి. దుర్గాదేవి పందిళ్లలో పూజల కోసం అవసరమైన సామగ్రి కోసం కమిటీ సభ్యులు రైతుబజార్‌కు తరలివచ్చారు. చెరుకు గడలు, ఆపిల్, కొబ్బరికాయలు, అరటిపండ్లు, పలు రకాల పళ్లు, అరటాకుల విక్రయాలు జోరుగా సాగాయి. రైతుబజార్ ఈవో కొండబాబు, సహాయకుడు సతీష్ వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా పర్యవేక్షించారు. బజారులో ఎటువంటి చిల్లర దొంగతనాలు జరగకుండా చర్యలు తీసుకున్నారు.

పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణ ఆపాలి

తాటిచెట్లపాలెం: పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణ ప్రక్రియ ఆపకుంటే ప్రతిఘటన తప్పదని సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు హెచ్చరించారు. పోర్టు ఆస్పత్రి వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో 11 రోజులుగా జరుగుతున్న రిలే నిరాహార దీక్షల వద్ద శుక్రవారం సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గునాయుడు మాట్లాడుతూ పోర్టు హాస్పిటల్‌ను పోర్టు నిధులతోనే 300 పడకల మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిగా అభివృద్ధి చేయాలన్నారు. పీపీపీ పేరుతో ప్రైవేటీకరణ వద్దని, టెండర్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విశాఖ పోర్టు ఏటా కనీసం రూ.300 కోట్లు లాభాలు ఆర్జిస్తోందని, వివిధ పన్నుల రూపంలో రూ.117 కోట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కడుతోందని తెలిపారు. ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్‌కు కట్టబెట్టాలనే మోదీ ప్రభుత్వం పోర్టు హాస్పిటల్‌ను కూడా వదలడం లేదని ఆరోపించారు. పోర్టు ఆస్పత్రిపై ఆధారపడిన 40 వేల మంది లబ్ధిదారుల ఆరోగ్యాన్ని కార్పొరేట్ల చేతుల్లో పెట్టడం దారుణమని, వారి హక్కులను కాలరాయడమేనన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బి.జగన్, ఆర్కేఎస్‌వీ కుమార్, బి.ఈశ్వరమ్మ, బి.పద్మ, యు.ఎస్.ఎన్.రాజు, జిల్లా నాయకులు పి.పైడిరాజు, అప్పలరాజు, వి.నరేంద్రకుమార్, ఎం.రాంబాబు, బి.రమణి, ఎం.సుబ్బారావు, వెంకటరావు, సత్యనారాయణ, కె.ఎం.కుమార మంగళం, కె.కుమారి తదితరులు పాల్గొన్నారు.

జగన్మాత నమో నమః


భూలోకమాతకు పూజలు చేస్తున్న శ్యామలదీపిక, సునీల్ అగర్వాల్


అమ్మవారి సన్నిధిలో నృత్యం చేస్తున్న కళాకారిణులు


గాయత్రి హోమంలో పాల్గొన్న భక్తులు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు రేసపువానిపాలెం భూలోకమాత ఆలయంలో శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని బీజేపీ నాయకులు శ్యామల దీపిక, సునీల్ అగర్వాల్ కుటుంబ సభ్యులతో దర్శించుకుని పూజలు చేశారు. నవరాత్రి వేడుకల్లో భాగంగా ఈ నెల 12 వరకు అమ్మవారికి పంచామృతాభిషేకం, దివ్య అలంకారం, హోమం, కుంకుమ పూజలు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆలయ కమిటీ పెద్దలు, రేసపువానిపాలెం గ్రామ సేవా సంఘం నాయకులు పర్యవేక్షిస్తున్నారు.

పద్మావతికి మహార్నవమి పూజలు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో దసరా సందర్భంగా నిర్వహిస్తున్న త్రిరాత్రి పూజా మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం పద్మావతి అమ్మవారికి మహార్నవమి పూజలు చేశారు. ఆలయ అర్చకులు శేషాచార్యులు, వాసుదేవాచార్యులు ఆధ్వర్యంలో కలశంలో అమ్మవారిని ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సహస్ర కుంకుమార్చన అనంతరం తీర్థప్రసాద గోష్టి చేపట్టారు. భక్తులు అమ్మవారిని, వైభవుడిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. శనివారం వైభవుడిని సర్వాంగ వజ్రకవచంతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పిస్తారు. పద్మావతి అమ్మవారికి విశేషాలంకరణ ఉంటుంది.

శాస్త్రోక్తంగా గాయత్రి హోమం

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు శివాలయం కమిటీ కుర్రోళ్ల ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం రామకృష్ణానగర్‌లో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం గాయత్రి హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్థానిక నాయకులు పోతు సత్యనారాయణ, నాగమణి దంపతులు, బోడసింగి శ్రీధర్, పాండవ శ్రీను, పాండవ ఈశ్వరరావు, బొడ్డేటి మురళి, పెంటకోట హరి, భవానీమాల ధరించిన కమిటీ సభ్యులు పాల్గొని పూజలు చేశారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

శాంతిధామంలో మహార్నవమి వేడుకలు


నారీ శక్తి రూపాల్లో బాలికలు

మురళీనగర్: మురళీనగర్‌లోని బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం శాంతిధామంలో శుక్రవారం మహార్నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శాంతాధామం ఇన్‌చార్జి బీకే అపరంజి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కుమారీలకు హారతి సమర్పించారు. నారీ శక్తి రూపకాన్ని ప్రదర్శించిన బాలికలను సత్కరించారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీలు పాల్గొన్నారు.

ప్రతి వారం అన్నదానం


అన్నదానం చేస్తున్న కర్రి మురళీకృష్ణారెడ్డి

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు రేసపువానిపాలెంలో కేఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం అన్నదానం చేశారు. ట్రస్ట్ అధ్యక్షుడు కర్రి మురళీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి వారం ఈ ప్రాంతంలో 108 మందికి అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. ట్రస్టు ఆధ్వర్యంలో పేద విద్యార్థులు, ప్రజల కోసం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ట్రస్టు సభ్యులు కె.సత్యనారాయణరెడ్డి, కె.సీతయ్యమ్మ, కె.సుబ్బలక్ష్మి, ఆలయ కమిటీ ప్రెసిడెంట్ గురునాథ్‌రెడ్డి, సెక్రటరీ బాచి పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు రతన్ టాటా


రతన్ టాటా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

మురళీనగర్: దేశ నిర్మాణంలో ప్రముఖుడిగా పేరొందిన రతన్ టాటా మరణం తీరని లోటని మురళీనగర్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి అన్నారు. ఆయన ఆధ్వర్యంలో శుక్రవారం వాకర్స్ క్లబ్ సభా ప్రాంగణం వద్ద రతన్ టాటా సంతాప సభ నిర్వహించారు. దేశ ప్రతిష్టను విశ్వవ్యాప్తం చేసి పారిశ్రామిక దిగ్గజంగా పేరుపొంది, నీతి, నిజాయితీలకు మారుపేరుగా నిలిచిన రతన్ టాటా చరిత్రలో నిలిచిపోతారన్నారు. పారిశ్రామిక రంగానికే మార్గనిర్దేశం చేస్తూ దాతృత్వానికి మారుపేరుగా నిలిచారన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని సభ్యులు ఆకాంక్షించారు. రతన్ టాటా చిత్రపటానికి చంద్రమౌళి, ఇతర సభ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో క్లబ్ పూర్వ అధ్యక్షులు ఎస్.బుచ్చయ్య, ఆర్.సత్యనాథం, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగికి ఘన సత్కారం


రిటైర్డ్ డీఎస్‌వో శివప్రసాద్‌ను సత్కరిస్తున్న నేచురల్ ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు

మురళీనగర్: ఇటీవల పదవీ విరమణ చేసిన సివిల్ సప్లై అధికారి ఆర్.శివప్రసాద్‌ను శుక్రవారం మురళీనగర్ వాసులు ఘనంగా సత్కరించారు. మురళీనగర్ స్కేటింగ్ పార్కులో నేచురల్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్వతీపురం సివిల్ సప్లై డిపార్ట్‌మెంట్ డీఎస్‌వోగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. సంఘ సభ్యులు డీఎస్ఎన్ కుమార్, కార్యదర్శి ఎల్‌వీ సుధాకర్, కోశాధికారి సోమియారెడ్డి, రాఘవయ్య, వీఎస్ఆర్ శర్మ, జ్ఞానేశ్వర్, పోతురాజు, దేముడు, రాంబాబు, గంగాధర్, రామునాయుడు పాల్గొన్నారు.

భక్తిభావంలోనే దాతృత్వం


ఆర్‌బీఎల్ ఫౌండేషన్ మ్యాగజైన్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

మురళీనగర్: భక్తిభావం ఉన్న చోట దాతృత్వం ఉంటుందని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. పట్టాభిరెడ్డితోటలోని వానప్రస్థ వృద్ధాశ్రమ 13వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ యువతలో సామాజిక సేవా భావం పెంపొందించడంలో తల్లిదండ్రులు కీలకంగా వ్యవహరించాలన్నారు. ఆర్‌బీఎల్ ఫౌండేషన్ ద్వారా రొబ్బి శ్రీనివాస్ 13 ఏళ్లుగా వృద్ధులకు సేవలు చేస్తూ తరిస్తున్నారని ప్రశంసించారు. ముందుగా ఎమ్మెల్యే ఉత్సవాలను ప్రారంభించిన అనంతరం గోపూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రస్టు సేవా కార్యక్రమాల నివేదిక పత్రిక, అనాథల దహన సంస్కారాల కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, వృద్ధాశ్రమం మేనేజింగ్ ట్రస్టీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహా అన్నసమారాధనలు


సంజీవయ్యకాలనీ-2లో అన్నదానం చేస్తున్న డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్


గురునాథరావు కాలనీలో అన్నప్రసాదం వడ్డిస్తున్న పైడి రమణ


51వ వార్డులో అన్నప్రసాదం వడ్డిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

కంచరపాలెం: జీవీఎంసీ 47వ వార్డు సంజీవయ్య కాలనీ-2లో నిర్వహిస్తున్న దుర్గాదేవి ఉత్సవాల్లో భాగంగా దుర్గమ్మ సేవ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మహా అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ ప్రారంభించారు. ముందుగా దుర్గాదేవికి కటుమూరి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. సుమారు 2 వేల మందికి అన్నదానం చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు పుష్పలత, సరోజిని, కనక, హైమా, అన్నపూర్ణ, ఈశ్వరి, లావణ్య, వేణు, కొండమ్మ, కృపా, లక్ష్మి, వరలక్ష్మి, బొట్టా రాజు, ఎం.వి.రమణ, సాయి పాల్గొన్నారు.

45వ వార్డులో..

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు గురునాథరావు కాలనీ, తారకరామానగర్‌లో బాలగణపతి స్పీడ్ బాయ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి భారీ అన్నదానం నిర్వహించారు. కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ ప్రారంభించారు. ముందుగా అమ్మవారికి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు బొంగు వరహాలు, పందిరి ఫణీంద్ర, బెహర రమణ, చింతాడ దిలీప్, లంకే వేణు, స్థానికులు పాల్గొన్నారు.

ఆటో స్టాండ్ ఆధ్వర్యంలో..

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డులోని వైఎస్సార్‌సీపీ వార్డు కార్యాలయం ఎదురుగా వరాహ లక్ష్మీనరసింహ స్వామి ఆటో స్టాండ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దుర్గాదేవి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రత్యేక పూజలు, భారీ అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమాలను కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ ప్రారంభించారు. కె.శ్యామ్, కె.వి.రాజు, అప్పలరాజు, మోహన్, నాని, ఆటో స్టాండ్ సభ్యులు పాల్గొన్నారు.

ముందు జాగ్రత్తలతో క్యాన్సర్ నివారణ


పాపా హోంలో వ్యాక్సిన్లు వేసుకున్న బాలికలతో డాక్టర్ మురళీకృష్ణ తదితరులు

సీతమ్మధార: సీతమ్మధార బాలికల పాపా హోంలో మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆస్పత్రి, రోటరీ క్లబ్ విశాఖ పోర్ట్ సిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత క్యాన్సర్ హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ వైద్య శిబిరం నిర్వహించారు. 9 ఏళ్ల నుంచి 14 ఏళ్ల వయసు లోపు 40 మంది బాలికలకు భవిష్యత్తులో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్(సర్వైకల్) వ్యాధిన పడకుండా హెచ్‌పీవీ వ్యాక్సిన్ ఇంజక్షన్ ద్వారా వేశారు. ఈ సందర్భంగా క్యాన్సర్ వైద్య నిపుణుడు డాక్టర్ వి.మురళీకృష్ణ మాట్లాడుతూ క్యాన్సర్ ప్రాణాంతకమైన వ్యాధి కాదని, ముందస్తు జాగ్రత్తలతో నివారించవచ్చని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకుని తగు జాగ్రత్తలు తీసుకుంటే క్యాన్సర్ వ్యాధి బారిన పడకుండా ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు. మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పిటల్ సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.1.50 లక్షల ఖరీదైన వ్యాక్సిన్లు బాలికలకు ఉచితంగా అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ విశాఖ పోర్ట్ సిటీ అధ్యక్షుడు కె.వెంకటరమణ, పాపా హోం అధ్యక్షుడు డి.సూర్యప్రకాశరావు, కార్యదర్శి వి.ప్రకాశరావు, కోశాధికారి రమేష్ చంద్‌జైన్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.